క్లుప్తంగా

సెలవుల్లో తరగతుల నిర్వహణ తగదు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : దసరా సెలవులలో ప్రైవేటు ఉపాధ్యాయులకు వర్క్‌షాప్‌ పేరుతో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థల వద్ద డీవైఎఫ్‌ఐ ఆందోళన నిర్వహించారు. ప్రైవేట్‌ ఉపాధ్యాయులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్‌ మాట్లాడుతూ జిల్లాలో యథేచ్ఛగా ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లు నడుస్తున్నా, ప్రైవేటు ఉపాధ్యాయులకు తరగతులు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్‌ చల్లా రాజశేఖర్‌

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : మహా ప్రవక్త మహమ్మద్‌ (సా.అ.వ) మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని కార్పొరేటర్‌ చల్లా రాజశేఖర్‌ తెలిపారు. మహమ్మద్‌ ప్రవక్త జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడప నగరం రవీంద్రనగర్‌ యూత్‌ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా ప్రవక్త ఒక్క ముస్లిం సమాజానికే కాకుండా సర్వమానవాళిని సన్మార్గంలో నడిపేందుకు చివరి ప్రవక్తగా వచ్చారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని మానవ జీవితానికి సార్థకత చేకూరేలా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు వెంకట్‌, బాలు, సయ్యద్‌ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న తౌహిద్‌ఖాన్‌, మన్సూర్‌ అలీఖాన్‌

కడప కల్చరల్‌ : స్థానిక ప్రకాశ్‌ నగర్‌లోని అర్బన్‌ బాయ్స్‌ హాస్టల్‌ విద్యార్థులకు ఆదివారం అబ్దుల్‌ కలాం సేవా సమితి అధ్యక్షుడు, ఆడిటర్‌ పఠాన్‌ తౌహిద్‌ఖాన్‌ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. మాజీ రాష్ట్రపతి, భారతదేశపు మిసైల్‌ మ్యాన్‌, ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్‌ కలాం 93వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యాసాధన విద్యా సంస్థల డైరెక్టర్‌, చాంద్‌బీ చారిటబుల్‌ ట్రస్టు చైర్మన్‌ లయన్‌ పి.మన్సూర్‌ అలీఖాన్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వారు అబ్దుల్‌ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, క్యాలిగ్రఫీ పుస్తకాలు, ఇతర స్టేషనరీ వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శరణ్‌కుమార్‌, సూర్య, జోసెఫ్‌, విష్ణువర్ధన్‌, రహమతున్నీసా, జావీద్‌ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాతియా మెహఫిల్‌



నాతియా మెహఫిల్‌ కార్యక్రమంలో పాల్గొన్న నాత్‌ గాయకులు, ముస్లిం ప్రముఖులు

కడప కల్చరల్‌ : మహా ప్రవక్త మహమ్మద్‌ జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి కడప నగరంలోని గుంతబజారు సర్కిల్‌లో నాతియా మెహఫిల్‌ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా హాజరయ్యారు. సుభాన్‌బాషా నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ముస్లిం ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాతియా మెహఫిల్‌ కార్యక్రమంలో పాల్గొన్న వారందరినీ డిప్యూటీ సీఎం ఘనంగా సత్కరించారు. ప్రవక్త చూపిన శాంతి మార్గంలో నడవాలని సూచించారు. మానవులంతా ఒక్కటేనని బోధించిన ఆయనను మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. ఈ మాసంలో అన్నదానాలు, నాతియా మెహఫిల్‌ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు.

శిల్పారామంలో చిన్నారుల నృత్యాలు



శిల్పారామంలో నృత్య ప్రదర్శన

కడప కల్చరల్‌ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా నృత్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కడప నగరానికి చెందిన వర్షిణి డ్యాన్స్‌ అకాడమి విద్యార్థులు ఈ సందర్భంగా ప్రముఖ సినీ గీతాలతోపాటు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. శిల్పారామం ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు.

జగన్మాతా..నమోస్తుతే!



పూజలందుకుంటున్న బాల పోలేరమ్మ



బాల పోలేరమ్మకు మంగళ హారతి



సత్యదేవునికి శ్రీ కోదండ రామ అలంకారం



దీక్షా బంధన అలంకారంలో శ్రీ వాసవాంబ



బాలత్రిపుర సుందరిగా నదివీధి గంగమ్మ



భావనారుషి ఆలయంలో బాల త్రిపురసుందరిదేవి

- ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- విద్యుద్దీప కాంతులతో వెలుగుతున్న ఆలయాలు

కడప కల్చరల్‌ : అమ్మలగన్న అమ్మ..ముగ్గురమ్మల మూలపుటమ్మ.. చాలా పెద్దమ్మ.. మాయమ్మ జగన్మాతకు ప్రణమిల్లుతున్నాను.. అంటూ అమ్మవారి ఆలయాల్లో భక్తులు మనసారా పూజలు చేశారు. ఆలయాలు ఉత్సవ కళను సంతరించుకున్నాయి. భక్తులు నిలువెత్తున బంగారు కాంతులతో ధగధగలాడుతున్న అమ్మవారిని దర్శించుకుని తన్మయులయ్యారు.

■ కడప నగరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.30 గంటలకు ఆలయాలలో ప్రత్యేక పీఠాలు ఏర్పాటు చేసి అమ్మవారిని కళ్లుచెదిరే అంకరణలో కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులిచ్చారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక చిన్నబెస్తవీధిలోని బాల పోలేరమ్మ ఆలయంలో మూలమూర్తితోపాటు అమ్మవారి మట్టి విగ్రహానికి దీక్షా బంధన అలంకారం చేశారు.

■ అమ్మవారి దర్శనం కోసం భక్తులు మెయిన్‌రోడ్డు వరకు బారులు తీరారు. బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు. దేవునికడపలో స్వామి, అమ్మవార్లను తిరుచ్చి అలంకారంలో మాడవీధుల్లో ఊరేగించారు. గడ్డిబజారు శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామిని శ్రీ కోదండ రామునిగా అలంకరించారు. కళాంబదేవి ఆలయంలో కూడా విశేష అలంకారం చేశారు.

■ హనుమప్పవీధిలోని శ్రీ భద్రావతి భావనారుషి ఆలయంలో అమ్మవారిని దీక్షా బంధన అలంకారంలో కొలువుదీర్చారు. ఆలయ కమిటీ చైర్మన్‌ ఆమంచి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

■ స్థానిక అమ్మవారిశాలలో దీక్షా బంధనం అలంకారం చేశారు. పలువురు ప్రముఖులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మునగా శ్రీనివాస్‌, ఉత్సవ కమిటీ చైర్మన్‌ బెస్తవేముల రామమహేష్‌ల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శైలిపుత్రిగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక మున్సిపల్‌ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో కూడా విశేష పూజలు నిర్వహించారు. ఇంకా నగరంలోని నబీకోట శ్రీ రామలింగచౌడేశ్వరీదేవి ఆలయంలో మూల విరాట్‌తోపాటు ఆలయం వెలుపల ప్రత్యేక వేదికపై అమ్మవారిని కొలువుదీర్చారు. అదేవిధంగా నాగరాజుపేట, ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీమాత ఆలయంతోపాటు ఇతర 15 ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.

సామాజిక విప్లవకారుడు సీఎం వైఎస్‌ జగన్‌



మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసి సామాజిక విప్లవ కారునిగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారని మోస్ట్‌ బ్యాక్‌వర్డ్‌ క్లాస్‌(ఎంబీసీ) రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా తెలిపారు. ఆదివారం కడప నగరం ఏడురోడ్ల కూడలి వద్ద ఉన్న ఎంబీసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేకమంది బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ద్వితీయ శ్రేణి నాయకులను రాజకీయంగా అందలం ఎక్కించిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌ అన్నారు. నవంబర్‌ 15 వ తేదీ నుండి కులాల వారీగా జన గణన చేయాలని ఆదేశాలు జారీ చేయడం పట్ల బీసీ కులాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎంబీసీ ప్రచార కార్యదర్శి కుళాయిప్ప, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పాపాసాహెబ్‌ పాల్గొన్నారు.

వైవీయూ ఉద్యోగి మృతికి సంతాపం

వైవీయూ/కడప కల్చరల్‌ : యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం ఉద్యోగి పసుపులేటి చంద్రకిశోర్‌ మృతి పట్ల విశ్వవిద్యాలయం అధికారులు సంతాపం తెలిపారు. ఆదివారం ఆయన స్వగృహం వద్ద ఉంచిన భౌతికకాయాన్ని వైవీయూ రిజిస్ట్రార్‌ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి, సీపీ బ్రౌన్‌ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్‌. ఈశ్వరరెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పీఆర్‌ సెల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌.వి. సుబ్బారెడ్డి, ఉమన్‌ ఎంపవర్‌మెంట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఆచార్య పాలెం రమాదేవి తదితరులు విచ్చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. దహనసంస్కారాల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు విశ్వవిద్యాలయం తరపున రిజిస్ట్రార్‌ ఆర్థికసాయాన్ని అందజేసి సానుభూతి తెలిపారు. విశ్వవిద్యాలయం కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వీరితో పాటు బ్రౌన్‌ కేంద్రం సలహామండలి సభ్యులు జానుమద్ది విజయభాస్కర్‌, సాహితీ ప్రముఖులు గానుగపెంట హనుమంతరావు, అలపర్తి పిచ్చయ్య చౌదరి, డాక్టర్‌ చింతకుంట శివారెడ్డి, వేంపల్లి షరీఫ్‌, లయన్స్‌క్లబ్‌ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, అరసం కార్యదర్శి డాక్టర్‌ టి. సురేష్‌బాబు, రాజగోపాల్‌రెడ్డి, బ్రౌన్‌ కేంద్రం సిబ్బంది నివాళులర్పించారు.

మల్చింగ్‌ విధానంపై రైతుల ఆసక్తి



మల్చింగ్‌ విధానంలో సాగుచేసిన పంట

పులివెందుల రూరల్‌ : మల్చింగ్‌ విధానంపై రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. బిందు, తుంపర సేద్యాల తరహాలో ఈ మల్చింగ్‌ విధానంపై ఇప్పుడిప్పుడే రైతన్నలు వివిధ పంటలు సాగుచేసేందుకు ఉత్సాహం కనపరుస్తున్నారు. ఈ విధానం ఎంతో లాభదాయకమని రైతులు అంటున్నారు. ఈ సరికొత్త ప్రయోగం ద్వారా ఆశించిన ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నట్లు రైతులు అంటున్నారు. మొక్క చుట్టూ వ్యాపించి ఉన్న వేరు వ్యవస్థను ఏదైనా పదార్థాలతో కప్పడాన్ని మల్చింగ్‌ విధానం అంటారు. కృత్రిమంగా తయారుచేసే ప్లాస్టిక్‌ షీట్‌ తోనూ మల్చింగ్‌ చేసే అవకాశం కూడా ఉంది. ఈ పద్ధతులను ఉపయోగించడం ద్వారా భూమిలోని తేమను సంరక్షించడంతో పాటు కలుపు నివారణ, నేలకోతకు గురికాకుండా కాపాడుకోవచ్చని రైతులు అంటున్నారు. ఈ రసాయన ఎరువులు, సంరక్షణకు అయ్యే ఖర్చులు 20 శాతానికి పైగా ఆదా చేసుకునే అవకాశం ఉంది. ఈ పద్ధతి నేల ఉపరితలాన్ని కప్పి ఉంచడంతో పాటు రక్షణగా ఉండటంతో పాటు తేమను కాపాడటం, కలుపుదల మొక్కలను అణచివేయడం, ఉష్ణోగ్రత నియంత్రించడం జరుగుతుంది. అలాగే ఈ నేల కోతను తగ్గించడం వంటి అనేకరకమైన ప్రయోజనాలు ఈ విధానం అందిస్తుంది. ఈ మల్చింగ్‌ విధానానికి ఎక్కువగా ప్లాస్టిక్‌ పట్టలను ఉపయోగిస్తారు. ఒక్కో కట్ట 400 మీటర్లు ఉంటుందని, వీటి విలువ రూ.1000ల నుంచి నాణ్యతను బట్టి రూ.1500ల వరకు ఉంటుంది. ఎకరా సాగు విస్తీర్ణం ఆధారంగా 5 లేదా 6 ప్లాస్టిక్‌ పట్టలను ఎకరాకు ఉపయోగిస్తారు. ఇలాంటి వ్యవసాయ విధానంలో మల్చింగ్‌ పద్ధతిని పాటించే రైతులకు ప్రభుత్వం కాస్త వెసలుబాటు కల్పిస్తే బాగుంటుందని రైతన్నలు అంటున్నారు. బిందు, తుంపర సేద్యాల తరహాలో మల్చింగ్‌కు ఉపయోగించే ప్లాస్టిక్‌ పట్టలకు రాయితీ అందిస్తే ఎక్కువ మంది రైతులు మల్చింగ్‌ విధానంలోనే పంటలు సాగు చేసేందుకు ఆసక్తి కనపరుస్తారు.

సాహస పర్యాటకంపై వర్క్‌షాప్‌

వేంపల్లె : సాహస పర్యాటకంపై ఉచిత వర్క్‌షాప్‌ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఏపీ ఫౌండర్‌ రంగారావు, ప్రెసిడెంట్‌ మోహన్‌రావులు తెలిపారు. 1991లో స్థాపించబడిన మొట్టమొదటి సాహస క్రీడల సంస్థ ఏపీ ఏపీ ఇప్పటివరకు సుమారు 32 సంవత్సరాలుగా 6 లక్షల మంది విద్యార్థులు, యువకులు కార్పొరేట్‌ వారికి వివిధ సహాస క్రీడల్లో శిక్షణ ఇచ్చిందన్నారు.

ఈ నేపథ్యంలో సాహస పర్యాటకంపై యువతకు అవగాహన కల్పించడానికి డాక్టర్‌ వైఎస్సార్‌ అడ్వెంచర్‌ టూరిజం లీడర్‌ షిప్‌ వర్క్‌షాప్‌ను గండి క్షేత్రం వద్ద ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఉత్తమంగా నిలిచిన 10 మంది యువకులకు అక్టోబర్‌ 29న ఇడుపులపాయ వద్ద పూర్తి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువకులు సొంత యూనిట్స్‌ చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో పాల్గొనేవారు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయసు వారై ఉండాలన్నారు. కానీ వీరికి కనీసం వ్రాయడం, చదవడం తెలిసి ఉండాలన్నారు. అంతేకాకుండా నుప్రహా యువకేంద్రం అనుబంధం యువజన సంఘాలు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌ వారు కూడా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 25లోపు తమ వివరాలను నెంబర్‌ 9849270575కు పంపాలని కోరారు.

మొహిద్దీన్‌ఖాన్‌కు వెంపటి చినసత్యం స్మారక పురస్కారం

ప్రొద్దుటూరు కల్చరల్‌ : పట్టణానికి చెందిన నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు పి.మొహిద్దీన్‌ఖాన్‌కు వెంపటి చినసత్యం స్మారక పురస్కారం లభించింది. కృష్ణాజిల్లా కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాక్షేత్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌ భాషా సాంస్కృతిక శాఖ కృష్ణాజిల్లా యంత్రాంగం, సేవ్‌ కూచిపూడి ఆర్ట్‌ అకాడమి చెన్నై, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జయహో భారతీయం ఆధ్వర్యంలో పద్మభూషణ్‌ అవార్డు గ్రహీత వెంపటి చినసత్యం జయంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకలో మొహిద్దీన్‌ ఖాన్‌ కూచిపూడి నాట్యానికి చేసిన సేవలకు, అభివృద్ధికి పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి ఆర్‌కే రోజా, గృహ నిర్మాణ శాఖామంత్రి జోగిరమేష్‌, ఎమ్మెల్యే అనిల్‌ కుమార్‌లు ఈ పురస్కారం అందుకున్నారు.

తరగతులను అడ్డుకున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : కడప నగరంలోని ప్రైవేట్‌, కార్పొరేట్‌ విద్యాసంస్థలు విద్యాశాఖ ఆదేశాలను లెక్కచేయకుండా సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తుండటంతో ఆదివారం మధ్యాహ్నం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాఠశాలలకు వెళ్లి తరగతులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్‌ కుమార్‌, నగిలి రాజేంద్ర ప్రసాద్‌ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని కార్పొరేట్‌, ప్రైవేట్‌ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాహుల్‌, జిల్లా కమిటీ సభ్యుడు అజయ్‌ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కమలాపురం : కృష్ణా జలాలపై ఈనెల 18న కడపలో జరుగుతున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్‌ పిలుపునిచ్చారు. ఆదివారం కమలాపురంలో ఆయన పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. కృష్ణా జలాలతో రాజకీయం చేస్తూ ఏపీ భవిష్యత్తును, సీమ ప్రాజెక్టులను అంధకారంలోకి నెట్టేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకించాలన్నారు. ఏపీలో మిగులు జలాలపై ఆధార పడిన గాలేరు–నగరి, హంద్రీ నీవా, వెలుగోడు, బ్రహ్మసాగర్‌ ప్రాజెక్టులకు నీరు రాకుంటే ఈ ప్రాంతమంతా ఎడారిగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కురుక్షేత్ర మహాసభను విజయవంతం చేయండి

పులివెందుల టౌన్‌ : కురుక్షేత్ర మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్‌ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన కర్నూలులో నిర్వహించే ఎమ్మార్పీఎస్‌ కురుక్షేత్ర మహాసభను ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 10వ వార్షికోత్సవ సదస్సుకు ముఖ్య అతిథిగా పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ హాజరౌతారన్నారు. ఈ సదస్సుల్లో ఎమ్మార్పీఎస్‌ సమస్యలపై చర్చించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు నాగభూషణం, కృష్ణమూర్తి, ఆంజనేయులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి తోడ్పాటు



స్టీలు కడ్డీలను వితరణగా అందజేసిన జెడ్పీటీసీ నరేన్‌ రామాంజులరెడ్డి

చింతకొమ్మదిన్నె : క్రైస్తవుల ప్రార్థనా మందిరమైన చర్చి నిర్మాణానికి అవసరమైన ఇనుప కడ్డీలను జెడ్పీటీసీ నరేన్‌ రామాంజులరెడ్డి వితరణగా అందజేశారు. మండలంలోని కొప్పర్తి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి నరేన్‌ రామాంజులరెడ్డి ఒక టన్ను స్టీల్‌ వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజల సౌకర్యార్థం ప్రతి గ్రామంలో కుల మతాలకు అతీతంగా ప్రార్థనా మందిరాలకు తన వంతు సహకారం అందిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ లక్ష్మీనారాయణరెడ్డి, మండల నాయకులు నాగమల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌ శివరామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలులో జాప్యం నివారించాలి



మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఈ సంవత్సరం జూలై నుంచి నూతన పీఆర్సీ అమలు చేయాలని, అయితే తీవ్ర జాప్యం వలన ఉద్యోగులు నష్టపోతున్నారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ రద్దు చేసి పాత పెన్షన్‌ ఇస్తామని మాట ఇచ్చి జీపీఎస్‌ అమలు చేయడం దారుణమన్నారు. సీపీఎస్‌ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌ ఎస్సార్‌ వెంకట జనార్ధన్‌ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఆర్‌ కమిటీకి కార్యాలయాన్ని, సిబ్బందిని కేటాయించాలన్నారు. గత పీఆర్సీ అమలును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మంచి ఫిట్‌మెంట్‌ ఇచ్చే ఏర్పాటు చేయాలని ఎస్‌ఎల్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌ కొండయ్య కోరారు.

అబ్దుల్‌ కలాం అంకితభావం ఆదర్శం



కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీసీసీ బ్యాంకు ఓఎస్‌డీ, డిప్యూటీ రిజిస్ట్రార్‌, తదితరులు

కడప అగ్రికల్చర్‌ : అబ్దుల్‌ కలాం అంకితభావం, దేశభక్తి, నిజాయితీ, కష్టపడేతత్వం నేటి యువతకు ఆదర్శం అని కడప డీసీసీ బ్యాంకు ఓఎస్‌డీ, డిప్యూటీ రిజిస్ట్రార్‌ బి. గుర్రప్ప అన్నారు. ఆదివారం కడపలోని డీసీసీ బ్యాంకులో అబ్దుల్‌కలాం 92వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన రాష్ట్రపతిగా దేశ ప్రజల మన్ననలు పొందారన్నారు. అలాగే భారతదేశ రక్షణ రంగానికి అత్యంత బలీయమైన క్షిపణులు, అణుపరీక్షలు, రక్షణ విమానాలతో భారతదేశాన్ని ప్రపంచంలోనే బలమైన సైనికశక్తిగా రూపొందించారన్నారు. కేవలం రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగానే కాకుండా కలాం ఉపాధ్యాయుడిగా తన బోధనలతో లక్షలాది మంది దేశ, విదేశీ విద్యార్థులను ప్రభావితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్యశాస్త్రం కోర్సుకు చక్కటి అవకాశాలు



ఎంకాం విద్యార్థులకు బోధిస్తున్న అధ్యాపకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని వాణిజ్యశాస్త్ర విభాగంలో ఎంకాం కోర్సు పూర్తి చేయడం ద్వారా వాణిజ్యరంగంలో చక్కటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వైవీయూ ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. వైవీయూలోని ఎంకాం కోర్సుల్లో ప్రవేశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఏపీ పీజీసెట్‌–23 ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రవేశాలు పొందాలని సూచించారు. పీజీ రెండేళ్ల కోర్సు పూర్తికాగానే ఉన్నతశ్రేణి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయంలోని గురుకులం అధునాతన భవనాల్లో డిజిటల్‌ విధానంలో తరగతుల నిర్వహణ, అధునాతనమైన కంప్యూటర్‌ ల్యాబ్‌, సుదీర్ఘ బోధన అనుభవం కలిగిన ఆచార్యుల బృందం మార్గదర్శకత్వం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందన్నారు. ఏపీ పీజీసెట్‌–23 అర్హత సాధించిన విద్యార్థులు వైవీయూ కామర్స్‌ విభాగంలో చేరాలని సూచించారు. పూర్తి వివరాలకు కామర్స్‌ విభాగాధిపతి ఆచార్య జి. విజయ భారతిని సంప్రదించాలని సూచించారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



విలేజ్‌ క్లీనిక్‌ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అనిమెల గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్‌క్లీనిక్‌ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు గ్రామంలోనే వైద్యం అందించాలన్న సంకల్పంతో రూ.18 లక్షలతో విలేజ్‌ క్లీనిక్‌ భవనాలను ఏర్పాటు చేస్తున్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని చూసించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కాంట్రాక్టర్‌ శ్రీనివాసుల్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్‌ డైరెక్టర్‌ వీరప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర సివిల్‌ సప్లై డైరెక్టర్‌ గోపాల్‌రెడ్డి, అనిమెల సర్పంచు నరేష్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్‌ శివాంజనేయరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాఘవ యాదవ్‌, స్థానిక నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, శంబురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.